

ఊరి శివారులో మునసబుగారింటిదగ్గర పుంతలో మా అమ్మ నన్ను కంది. తరువాత యే దేగో తన్నుకుపోతుందని వారింటి పెరట్లో గడ్డిమేటు చాటున గోడలో కూర్చో పెట్టింది. ఆ పెరట్లో ఆడవాళ్ళ ఋణ

గుణధ్వని వినలేకా, వీధి వెంపు ఉంటే కాస్తంత కొత్త మొహాలు కనబడి కాలక్షేపం అవుతుందనీ మెల్లిగా వాకిలివేపు వెళ్ళి వీధరుగుల మీద గాదె చాటున బసచేశాను. మునసబుగారు పెద్దవాడై కొడుక్కి పని ఒప్పగించేశాడు. గాదెకి కొంచెం అసింటా పడక్కుర్చీ వేసుకుని పులిలా కూర్చుని కృష్ణా రామా అనుకుంటూ, వాళ్ళనూ వీళ్ళనూ చివాట్లేస్తూ, పిల్లలకి సలహాలు చెబుతూ, గడించిన ఆస్తిని నిలబెట్టుకునే ఉపాయాలు చేస్తూ వుండేవాడు. ఆయన ఉండడం మానేస్తే బాగుండునని ఆయనకు అప్పు పడ్డవాళ్ళు అనుకుంటూ ఉండేవారు. కానీ ఈయన మొండి వసూళ్ళు పూర్తి కాందే పోరాదని తీర్మానించుకున్నాడు. ఆయన కులదీపకుడు గుర్నాథం ఒకనాడు హడావుడిగా యెక్కణ్నించో ఇంటికొచ్చి నాన్నా ఓ అయిదొందలివ్వే నాన్నా అర్జెంటుగా అన్నాడర్జెంటుగా.

ఏవిటోయ్ ఆ అర్జెంటూ ఏమిటా దూకుడూ, యెందుకంత డబ్బు? అన్నాడు మునసబుగారు.

ఓ ఫ్రెండుకి అప్పివ్వాలిలే. పాపం, మళ్ళీ రేపిచ్చేస్తానన్నాడు అన్నాడు గుర్నాథం.

అట్టె అట్టె గుర్రాన్ని కట్టెయ్. ఔనుగానీ, నువ్వూ వాడూ పోట్లాడుకున్నారా? అన్నాడు తండ్రి.

మునసబుగారు విట్టీగా మాటాడతారని ఆయన పెళ్ళాం బిడ్డలూ, వూళ్లో జనాభా, అప్పులడగ వచ్చేవాళ్ళూ అంతా చెప్పుకుంటూనే ఉంటారు. ఆయన మొహం మీదే నిర్మొహమాటంగా అనేస్తారుకూడా.

తండ్రి చమత్కారానికి కొడుకు నవ్వాడు.

బలేవాడివే నాన్నా, పోట్లాడుకుంటే అప్పుకావాలని వాడెలా అడుగుతాడు. నేనెందుకిస్తానూ అన్నాడు.

ఇంకెందుకుటా, అందుకే పోట్లాడుకోబట్టే వాడికి నీమీద కోపం వచ్చి అప్పడిగేశాడు. నీకు వాడిమీద తిక్కరేగి ఇస్తానంటున్నావు .... అప్పంటూ యిచ్చాక ఇహ కజ్జాలు రావడం ఎంతసేపుటా అన్నాడు మునసబుగారు.

పోవేనాన్నా! నువ్వంతా విడ్డూరంగా మాటాడతావు. తొందరగా తాళపుజేతులివ్వు. అతను శివాలయంకాడ కూచున్నాడు. బాగుండదు కష్టపెట్టుకుంటాడు అన్నాడు గుర్నాథం.

కొడుకుమాట పట్టించుకోకుండా, ఓ చుట్ట తీసి వెలిగించేరు మునసబుగారు. అబ్బీ శివాలయం వీధిలో శేషయ్య గార్నెరుగుదువుగదా అన్నాడు.

ఆ! ఎరక్కే, వెధవ- మహా దుర్మార్గుడు, రాక్షసుడు.